ఆలయంపై నుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మాణం

- రీ అలైన్‌మెంట్ చేయాలంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతల నిరసన

సైదాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టవద్దంటూ మంగళవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు నిరసన దీక్ష చేపట్టారు. నిర్మాణ పనులను ఆపేసి రీ అలైన్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆలయం మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేపడితే భక్తులు సహించరన్నారు. కొందరికి అనుకూలంగా జీహెచ్ఎంసీ, ఎస్ఆర్‌డీపీ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరోసారి సర్వే నిర్వహించి రీ అలైన్‌మెంట్ చేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి, జంగం శ్వేతామధుకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, నేతలు నిరంజన్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు చవ్వ సతీష్, వినయ్ కిషోర్‌యాదవ్, బర్ల శ్రవణ్, బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి స్వర్ణలత, కొరుడు భూమేశ్వర్, కావేటి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించిన బీజేపీ హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత తదితరులు


సైదాబాద్ ప్రధాన రహదారిలో హనుమాన్ ఆలయం పై నుంచి నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి

బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చాల్సిందే : మాధవీలత

ఆలయ పవిత్రతకు భంగం కలిగించే స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని, లేకపోతే నగర వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత హెచ్చరించారు. ఆమె నిరసన దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. సమస్య పరిష్కరించే వరకు ఆలయం ఎదుట నిరాహారదీక్ష చేస్తామన్నారు.

గ్రేటర్ కమిషనర్ హామీతో ధర్నా విరమణ

నిరసన దీక్ష చేపడుతున్న నేతలు ఒకసారిగా సైదాబాద్ ప్రధాన రహదారిపైకి వచ్చి ధర్నా చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్ సమస్యను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ దృష్టికి తీసుకెళ్లారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కారిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం



హైదరాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మక డి.లిట్ లభించింది. భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేష సేవలందించినందుకు, అకాడమీని అభివృద్ధి పథంలో నడిపినందుకుగాను ఈ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్లు మహేంద్రకర్మ విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్ జగదల్పూరులోగల విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, శ్రీనివాసరావుకు డి.లిట్ ప్రదానం చేశారు.

అన్ని పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 9 ఎంపీ సీట్లు కేటాయించాలని, లేదంటే ఆ పార్టీల భరతం పడతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. జనగణనలో కులాల వారీగా బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ. 2,150 కోట్లు మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. 75 కోట్ల బీసీ జనాభాకు ఆ నిధులు ఏ మూలకు సరిపోవని అన్నారు. దేశంలో బీసీ యువజన సంఘాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, యూపీ, బిహార్ రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేశామని, మిగతా రాష్ట్రాల కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీమ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, సుధాకర్ ముదిరాజ్, రామకృష్ణ, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు


సదస్సులో మాట్లాడుతున్న మేడి పాపయ్య మాదిగ

మాదిగలకు మూడు ఎంపీ స్థానాలను కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలను మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి స్థానాలను అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకే కేటాయించాలన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ యువసేన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. యువసేన రాష్ట్ర కో-ఆర్డినేటర్ మంచాల యాదగిరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాపయ్య మాట్లాడుతూ.. ఎంపీ స్థానాల సాధనకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పులిజాల గెల్వయ్య, యాదయ్య, మేడి రమణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి : యాదస్వామి

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు యాదస్వామి సీఎంను కోరారు. రాష్ట్రంలో గత 30ఏళ్లలో తొమ్మిదిసార్లు జరిగిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఒక్కసారి కూడా క్రాఫ్ట్ టీచర్ లేదా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లోనైనా క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను ప్రకటించి, నిరుద్యోగ క్రాఫ్ట్ టీచర్లను ఆదుకోవాలని సీఎంకు ప్రజాభవన్‌లో విజ్ఞప్తి చేశారు.

మహా శివరాత్రి సందర్భంగా...

ఏడుపాయలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్. మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్టీసీ హైదరాబాద్ సిటీ రీజియన్ సీబీఎస్ నుంచి ఏడుపాయలకు 113 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. ఈనెల 7 నుంచి 11వతేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన వివరించారు. 7వ తేదీన 8 బస్సులు, 8న 20 బస్సులు, 9న 40 బస్సులు, 10న 40 బస్సులు, 11న 5 బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఏడుపాయలకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షా ఫలితాలు విడుదల

- 7వ తేదీలోగా రీ వాల్యుయేషన్‌కు అవకాశం

కుషాయిగూడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక విద్యామండలి బోర్డు(ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. అభ్యర్థులు ఎస్‌బీటీఈటీ డాట్ తెలంగాణ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ నుంచి ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రీ వాల్యుయేషన్, ఆన్సర్ షీట్ కాపీలు కావాల్సిన వారు ఈ నెల 7వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌బీటీఈటీ సెక్రటరీ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాధానపత్రాల నకలు కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.100, రీ వాల్యుయేషన్ కోసం సబ్జెక్టుకు రూ.750 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. జూన్‌లో నిర్వహించే టైప్ రైటింగ్/షార్ట్‌హ్యాండ్ పరీక్షల కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

అర్ధరాత్రి తర్వాత తీవ్ర శబ్దకాలుష్యంపై పిటిషన్

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తాడ్‌బండ్ ప్రాంతంలో బంటియా గార్డెన్స్, ఇంపీరియల్ గార్డెన్స్ ఫంక్షన్ హాళ్ల ద్వారా అర్ధరాత్రి 12 తర్వాత కూడా తీవ్రమైన శబ్దకాలుష్యం జరుగుతోందని మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌కు చెందిన అడిషనల్ చీఫ్ ఇంజనీర్ జే. సతీశ్ భరద్వాజ హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను సుమోటోగా స్వీకరించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. ఈ వ్యవహారంపై వివరాలు తెలియజేయాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌కు మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఈ పిటిషన్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును ఇంప్లీడ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. కేవలం రూ.10 వేలు జరిమానా వేసి వదిలేస్తే పరిస్థితులు ఏమీ మారవని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శబ్దకాలుష్య నియంత్రణకు 2010లో జారీచేసిన జీవో నం.170 నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని.. పదోతరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది.

వాటర్‌ప్లాంట్ల జలచౌర్యంపై..

అండర్‌గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్ నుంచి వాటర్‌ప్లాంట్ యజమానులు నీటిని చోరీ చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాచిగూడ శ్మశానవాటిక వద్ద శిల్పా వాటర్‌ప్లాంట్ యజమానులు ప్రభుత్వ పైప్‌లైన్ నుంచి నీటిని చోరీచేస్తున్నారని ఉస్మాన్‌గంజ్‌కు చెందిన మొహమ్మద్ సల్మాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి రిజిస్ట్రీ నంబర్ ఇవ్వకపోవడంతో రెగ్యులర్ నంబర్ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. వాటర్‌ప్లాంట్ యజమానులు సహా మున్సిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల, పోలీసు శాఖలు, జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది.

మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్‌లో 'మైండ్‌స్పేస్ పవర్‌టాక్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్



ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, రాజమౌళిగుప్తా తదితరులు

మన్సూరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నాగోల్‌లోని పీబీఆర్ కన్వెన్షన్‌లో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పది మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు ఐవీఎఫ్ సేవాదళ్ చైర్మన్ బాలు గుప్తా ఆధ్వర్యంలో రెండువేల యూనిట్ల రక్తం సేకరించి తలసీమియా వ్యాధిగ్రస్తులకు అందజేశారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు మహిళలకు వారి వివాహాల కోసం మంగళసూత్రాలు, మెట్టెలు, గాజులు, చీరలు అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మహిళా సంక్షేమం అందరి బాధ్యత అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుండాలన్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న 40 మందికి లక్ష రూపాయల చొప్పున ఐవీఎఫ్ ఆధ్వర్యంలో సహాయం చేస్తున్నామని తెలిపారు. రాజమౌళిగుప్తా మాట్లాడుతూ.. కుటుంబ అభివృద్ధిలో స్త్రీ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ మహిళా అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంజుల, కొత్తకోట ఎంపీపీ మౌనిక, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, పబ్బ చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, కట్ట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రన్ ఫర్ నేషన్ ర్యాలీలో మహిళలు

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో

'రన్ ఫర్ నేషన్'

మన్సూరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు కాలంశెట్టి లయ ఆధ్వర్యంలో నారీ శక్తి వందన్ మారథాన్, రన్ ఫర్ నేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నాగోల్‌లోని శ్రేయాస్ కళాశాలలో నిర్వహించారు. నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళల స్థితిగతులు మెరుగుపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు నందికొండ గీతారెడ్డి, నూకల పద్మారెడ్డి, గీతారెడ్డి, రాధిక, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్ హెచ్చరించారు. జాఫర్‌గూడ సర్వే నంబర్ 319 భూదాన్ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం సిబ్బందితో కూల్చివేయించారు. అనంతరం గుంతపల్లిలో సర్వే నంబర్ 57లో నాలుగు బేస్‌మెంట్‌లను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల రక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ భిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.


నాగోల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ తరుణ్ జోషి

పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

- రాచకొండ సీపీ తరుణ్ జోషి

మన్సూరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి నాగోల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఆయన.. రిసెప్షన్, పెట్రోలింగ్ తదితర విభాగాల పనితీరు, సీసీ కెమెరాల నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని, బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేలా చూడాలన్నారు. అసాంఘిక శక్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. భరోసా కేంద్రాల ద్వారా మహిళల రక్షణ, వారి భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పిల్లల చేతుల్లో హింస, నిరాదరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులు కంట్రోల్ రూం నంబర్ 87126 62111కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని సీపీ అన్నారు.



ఓటరు అవగాహన ర్యాలీలో స్పెషల్ ఆఫీసర్ భవానీశంకర్, ఆర్డీవో సూరజ్‌కుమార్

ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

- స్పెషల్ ఆఫీసర్ భవానీశంకర్

ఎల్బీనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలని ప్రత్యేక అధికారి భవానీశంకర్ సూచించారు. మంగళవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్వీప్-2024లో భాగంగా బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్, మెప్మా సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం సరూర్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూరజ్‌కుమార్, డీఆర్‌డీఓ అధికారి శ్రీలత, సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ ఆదిత్య, ఆర్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

సైదాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఇక్షణ ఫౌండేషన్ పరీక్ష సామగ్రి అందజేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు అఖిల, సామాజిక కార్యకర్త రాజశేఖర్ రెడ్డి, హైస్కూల్ ఇన్‌చార్జి ఖుషియా, ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ కావ్యహారికకు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

మన్సూరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కామినేని ఆస్పత్రిలో కాలేయ వ్యాధి నిపుణురాలిగా పనిచేస్తున్న డాక్టర్ దెందుకూరి కావ్యహారిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఎంబీబీఎస్, ఎండీ, డీఎంలతోపాటు కాలేయ వ్యాధుల నివారణ, మార్పిడి శస్త్ర చికిత్సలలో పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ పూర్తిచేసినందుకు కావ్య ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. ఇటీవల ఆమెకు సదరు సంస్థ సర్టిఫికెట్ అందజేసిందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చాదర్‌ఘాట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీహెచ్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, ద్వారకాపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు, మూసారాంబాగ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు, శాలివాహననగర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ పేర్కొన్నారు.

'అంబికానగర్‌లో సమస్యలు పరిష్కరించాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 7వ వార్డు అంబికానగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. మంగళవారం కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాలనీ ఎంట్రెన్స్ వద్ద గల ప్లాస్టిక్ వ్యర్థాల కంపెనీతో దుర్వాసన వస్తోందని కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్‌ను కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు వెంకట్ రాములు, ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి అంబేడ్కర్, వెంకటేష్, మురళి, సాగర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.


భవనాన్ని పరిశీలించి ఏఈ హేమునాయక్‌తో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా

అసంపూర్తిగా మహిళా భవనం

చంపాపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ భూపేష్‌గుప్తానగర్‌కాలనీలో అసంపూర్తిగా ఉన్న మహిళా భవనాన్ని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా మంగళవారం పరిశీలించారు. రూ. 10 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనం అసంపూర్తిగా ఉందని కాలనీ అధ్యక్షుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్ డీసీకి వివరించారు. అసంపూర్తిగా ఉన్న పనులకు ఎస్టిమేట్ వేయాలని ఏఈ హేమునాయక్‌ను డీసీ ఆదేశించారు. విద్యుత్ వైరింగ్, తలుపులు, ప్రహరీ, గేట్ తదితర పనులు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ అశ్విని, సీఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కారుల ఫోరం కన్వీనర్‌గా బల్‌దేవ్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల ఫోరం కన్వీనర్‌గా రంగారెడ్డి జిల్లా కొహెడాకు చెందిన కందాళ బల్‌దేవ్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బల్‌దేవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమకారుల సంక్షేమం, అమరుల ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగే విష్ణువర్ధన్, కారింగుల నరేందర్‌గౌడ్, ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న బలదేవ్‌రెడ్డి



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కార్ల మెకానిక్ షెడ్‌లో షార్ట్ సర్క్యూట్

కొత్తపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో కార్ల మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం జరిగింది. కొత్తపేటకు చెందిన పవన్ కుమార్ సమతాపురి కాలనీలో 15 సంవత్సరాలుగా స్నేహ మోటార్స్ పేరుతో కార్ల మరమ్మతుల షెడ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో షెడ్డులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పవన్‌కుమార్‌కు విషయం చెప్పగా ఆయన వర్కర్లతో అక్కడికి చేరుకొని షెడ్డులో ఉన్న కార్లను బయటకు తరలించి చైతన్యపురి పోలీసులు, హయత్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఆయిల్ డ్రమ్స్, ప్లాస్టిక్ సామగ్రి కాలిపోయాయి.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సైదాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని సౌత్ ఈస్ట్ అదనపు డీసీపీ టి. స్వామి తెలిపారు. పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో మంగళవారం సైదాబాద్, మాదన్నపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ దాసు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా లక్కీడ్రాలో 10 మంది విజేతలు


లక్కీ డ్రా తీస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్

చాదర్‌ఘాట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ నడిపిన ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించి డ్రాప్ బాక్స్‌లో వేసిన కూపన్ల లక్కీ డ్రాలో 10 మంది విజేతలుగా నిలిచారు. వీరిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులు ఉన్నారు. ఆర్టీసీ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాస్ లక్కీ డ్రా తీసి విజేతల పేర్లను ప్రకటించారు. డి.సునీత, ఎస్.విజయలక్ష్మి, వైశాలి, డి.హర్షిణి, హెచ్. కళావతి, రామచంద్రం, నరహరి, అఖిల్, విఠల్, పి.శ్రీధర్ విజేతలుగా నిలిచిన వారిలో ఉన్నారు. విజేతలు ఒక్కొక్కరికి రూ. 9,900 నగదు బహుమతి అందజేస్తామని ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ బి. రాజు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం సరిరామ్, విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ మహంకాళి రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సైబర్ నేరాలపై చర్యలు తీసుకోవాలి'

ఇబ్రహీంపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జనరల్ మేనేజర్ అనూజ్‌రంజన్ అన్నారు. మంగళవారం గురునానక్ విద్యా సంస్థల్లో డిజిటల్ ట్రాన్సాక్షన్, సైబర్ నేరాలు, ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచారాన్ని దొంగిలించడం, ఈ-మెయిల్ బాంబింగ్, సలామి ఎటాక్, సర్వీస్ అటాక్‌ను అడ్డుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ డా.పి.పార్థసారథి పాల్గొన్నారు.